క్లుప్తంగా

వేడుకగా తిరుచ్చి ఉత్సవం



స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న యనకండ్ల, హుసేనాపురం ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మండల రూరల్ ఏఈ గర్జప్ప శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే రైతులకు ఉచిత విద్యుత్ తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

డోన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని పేరంటాలమ్మగుడి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక జాతీయ రహదారి, కోట్ల, వైఎస్ నగర్‌లు, తారకరామానగర్, శ్రీరామనగర్, ఆర్టీసీకాలనీ, శ్రీనివాసనగర్, డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డినగర్, నెహ్రూనగర్‌లతో పాటు మల్లెంపల్లె ఫీడర్ కింద ఉన్న లక్ష్ముంపల్లె, మల్లెంపల్లె గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి 10 గంటల వరకు..మళ్లీ సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

పొలంలోకి దూసుకెళ్లిన లారీ



కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న వరి పొలంలోకి శుక్రవారం లారీ దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. కొలిమిగుండ్ల నుంచి జమ్మలమడుగు వైపు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ ఫుల్‌గా మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన చోటే రోడ్డుపై మద్యం మత్తులో తూలుతూ రోడ్డుపై పడిపోయాడని చెప్పారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం



అన్నదానం చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ మాలిక్

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములకు ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్‌మాలిక్, సైలాభాను దంపతుల సహకారంతో శుక్రవారం అన్నదానం చేశారు. అయ్యప్పస్వామి దీక్ష స్వీకరించిన భక్తులకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని అబ్దుల్ మాలిక్ పేర్కొన్నారు.

నేడు అన్నాభిషేకం

డోన్ టౌన్: కార్తీక మాసం శుద్ధ అష్టమి శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దనున్న సాంబ శివాలయంలో ప్రాతఃకాల అభిషేకాల్లో భాగంగా శనివారం అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు క్లై శేషావలి శర్మ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పూజకు వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

డోన్ టౌన్: భారత ఎన్నికల సంఘం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 9,10, 23,24 తేదీల్లో కొత్తగా ఓటరు నమోదుతో పాటు ఉన్న వాటిలో మార్పులు చేర్పులకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్ అధికారులు వారికి కేటాయించిన బూత్‌లలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్యాపిలి పశువైద్యశాల



శిథిలావస్థలో ఉన్న చిన్నపాదిళ్ల డిస్పెన్సరి



శిథిలావస్థలో ఉన్న జలదుర్గం డిస్పెన్సరి



పోతుదొడ్డి ఆర్ఎల్‌యూ భవనం

శిథిలావస్థలో పశువైద్య భవనాలు

- పట్టించుకోని పాలకులు
- పెచ్చులూడి పడుతున్న పైనం
- వర్షం వస్తే పైకప్పు నుంచి కారుతున్న నీరు
- భయం..భయంగా విధుల నిర్వహణ
- ప్యాపిలిలో అద్దె భవనంలో వైద్యశాల నిర్వహణ



చిన్నపాదిళ్ల డిస్పెన్సరీ భవనం లోపలి దుస్థితి

ప్యాపిలి: పశువులకు వైద్య చికిత్స అందించడానికి ఏర్పాటు చేసిన భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. పాలకులు పశువైద్య భవనాల బాగోగుల గురించి పట్టించుకోకపోవడంతో వాటిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భయం..భయంతో కాలం వెల్లదీస్తున్నారు. ప్యాపిలి మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగుతోంది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని చిన్నపాదిళ్ల, హుసేనాపురం, జలదుర్గం, రాచర్ల గ్రామాల్లో వెటర్నరీ డిస్పెన్సరి భవనాలు ఉన్నాయి. వీటిలో హుసేనాపురం డిస్పెన్సరికి మాత్రమే కొత్త భవనం ఉంది. రాచర్ల, జలదుర్గం, చిన్నపాదిళ్ల డిస్పెన్సరి భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాలు చిన్నపాటి వర్షం వచ్చినా పైకప్పు కారుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో డిస్పెన్సరిల్లో మందులను భద్రపరచడం వైద్య సిబ్బందికి పెద్ద సమస్యగా మారింది. దశాబ్దాలుగా మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతో ఈ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాకాలంలో ఈ భవనాల్లో కూర్చొని విధులు నిర్వహించాలంటే వైద్య సిబ్బంది భయపడుతున్నారు.

ఆర్ఎల్‌యూలదీ అదే పరిస్థితి

మండల పరిధిలోని పెద్దపాదిళ్ల, ఏనుగుమర్రి, పోతుదొడ్డి, ఊటకొండ, గార్లదిన్నె గ్రామాల్లో రూరల్ లైవ్ స్టాక్ యూనిట్ భవనాలు (ఆర్ఎల్‌యూ) ఉన్నాయి. వీటిలో గార్లదిన్నె ఆర్ఎల్‌యూ నూతన భవనం నిర్మాణ దశలో ఉంది. ఏనుగుమర్రి భవనం మాత్రమే భద్రంగా ఉంది. పెద్దపాదిళ్ల, పోతుదొడ్డి, ఊటకొండ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ భవనాల నుంచి కూడా తరచూ పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో భయంగా భయంగా విధులు నిర్వహిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చేసి నూతన భవనాలను నిర్మించాలని సిబ్బంది, పశుపోషకులు కోరుతున్నారు.

పశువులకు అందని వైద్య సేవలు

మండలంలో 2.5 లక్షల చిన్న, పెద్ద పశువులు ఉన్నాయి. మరో లక్ష వరకు ఇతర పెంపుడు జంతువులు, కోళ్లు ఉన్నాయి. పశువైద్య భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వీటిలో విధులు నిర్వహించాలంటే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. దీంతో వైద్య సిబ్బంది తరచూ సెలవుల్లో ఉంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పశువులకు వైద్య సేవలు అందడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్యాపిలిలో పశువైద్యశాలకు నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. చిన్నపాదిళ్ల డిస్పెన్సరికి కూడా నూతన భవనం కావాలని ఉన్నతాధికారులను కోరాం. జలదుర్గం, రాచర్ల డిస్పెన్సరీలతో పాటు దెబ్బతిన్న ఆర్ఎల్‌యూ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరాం. ప్రభుత్వం నూతన భవనాలకు, పాత భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

–కిశోర్ కుమార్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, ప్యాపిలి

నేటి నుంచి ఓటరు నమోదు

సంజామల: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. ఈ నెల 9,10, 23,24వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్ : నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

–జడ్జి తంగమణి

డోన్ టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డోన్ సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. పట్టణంలోని శ్రీసుధ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై విద్యార్థులకు తెలియజేశారు. ముఖ్యంగా మహిళా చట్టాలు, ఈవ్ టీజింగ్, రోడ్డు భద్రత, ప్రమాదాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, బార్ కౌన్సిల్ సహాయ కార్యదర్శి నాగరాజుగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: విధుల్లో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ చైర్మన్ రాజేష్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన అమ్యూనిటీస్, ఎలక్ట్రీషియన్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు నెలలుగా వీధి దీపాల నియంత్రణ సరిగ్గా లేకపోవడం కారణంగా నెలకు సరాసరి రూ.లక్షన్నర వరకు బిల్లులు వస్తున్నట్లు తెలిపారు. దీంతో మున్సిపల్‌పై నిర్వాహణ భారం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారులతో విచారించగా 93 సీసీఎం పాయింట్స్ ఫెయిల్యూర్ అయినందున కరెంటు బిల్లులు అధిక మొత్తంలో వస్తున్నట్లు చెప్పారన్నారు. వీటిని వెంటనే మార్చి కొత్తవి అమర్చాలని, అలాగే అనధికార వాడకాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈ రఘు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

18న ఇంటి స్థలాల కోసం ఆందోళన

డోన్ రూరల్: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామంలో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున అందజేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఇంటి స్థలాల ప్రస్తావన చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు మోటరాముడు, నారాయణ, రామ్మోహన్, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

రామాంజినేయులుపై కేసు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతన్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్: పట్టణంలో సుమారు 340 మంది నుంచి రూ.25 కోట్లు వసూలు చేసి మోసం చేసిన రామాంజినేయులుపై పోలీసులు కేసు నమోదు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటారాముడు డిమాండ్ చేశారు. పట్టణంలోని నక్కిరామన్న భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ టాకీస్ వద్ద ఆఫీస్ ప్రారంభించి రెండేళ్లుగా లక్ష రూపాయలు ఇస్తే నెలకు రూ. 10 వేలు కలుపుకుని రూ.1,10,000 చెల్లిస్తానని ప్రజలను మోసం చేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో అనేక మోసాలు చేశాడని, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన ఇతను చీటీల పేరుతో రూ.90 లక్షలు మోసం చేసి, ఐపీ పెట్టాడన్నారు. అలాగే కర్నూలు జిల్లా కోసిగిలో కూడా మోసాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. సీపీఐ సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగరత్నం ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు

డోన్ టౌన్: పట్టణానికి చెందిన హరిస్వామి, రవి, శివ, భాస్కర్ అయ్యప్పమాల ధరించి పాదయాత్రగా శబరిమలకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం స్థానిక తత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడి ధరించారు. వీరికి ఆలయ కమిటీ అధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి చలం వీడ్కోలు పలికారు.

ఆశాజనకంగా కంది పైరు



ముక్కమల్లలో పూతదశలో ఉన్న కంది పంట

సంజామల: ఈ ఏడాదిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉంది. మండలంలో గత ఏడాది 700 ఎకరాల్లో పంట సాగు చేశారు. కింటాకు రూ.10 వేలు గిట్టుబాటు ధర లభించడంతో రైతులు లాభాలు పొందారు. దీంతో ఈ ఏడాది ఏకంగా 1,350 ఎకరాల్లో పంట వేశారు. అయితే కంది పంటలో ఎండు తెగులు, మరుక మచ్చ పురుగులు ఆశించాయి. నివారణ చర్యలు చేపడితే కందిలో అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్



ఆర్ఎస్ రంగాపురంలో నిరుపయోగంగా ఉన్న ప్లాంట్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏడాది కాలంగా మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. గ్రామస్తులకు పరిశుభ్రమైన నీరు అందించాలనే ఉద్దేశంతో 2017లో మైక్రో వాటర్ షెడ్డు పథకం కింద నిర్మించారు. ప్రారంభంలో గ్రామస్తులకు తక్కువ ధరలకే మినరల్ వాటర్ అందించడంతో అందరికీ సౌకర్యంగా ఉండేది. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకుని రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో దొంగ..?

- ఎనిమిది ఇళ్లలో చోరీ
- విచారణ జరుపుతున్న పోలీసులు

కోవెలకుంట్ల: కొంత కాలంగా మండలంలోని కంపమల్ల, దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామాల్లో వరుస చోరీలకు పాల్పడిన దొంగను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల బాధితులు అందించిన సమాచారం మేరకు.. కంపమల్లకు చెందిన శ్రీనివాసులు, మద్దయ్య, మత్తేస్, తిమ్మయ్య, చిన్నపుల్లయ్య, డేవిడ్, శాంతి, క్రిష్టిపాడుకు చెందిన ఆశీర్వాదమ్మ ఇళ్లలో చోరీలు జరిగాయి. కంపమల్లకు చెందిన ఓ యువకుడు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆయా గ్రామాలకు చెందిన బాధితులు రైతులు కావడంతో తెల్లవారుజామున ఇళ్లకు తాళం వేసి పొలాలకు వెళ్లేవారు. అలాంటి ఇళ్లను గుర్తించి చేతులు, కాళ్లకు సాక్సులు వేసుకుని తాళాలు పగలగొట్టి ఇళ్లలో ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదు అపహరించాడు. తిరిగి వెళ్లే సమయంలో ఎలాంటి ఆధారాలు లభ్యం కాకుండా కారంపొడి చల్లి వెళ్లేవాడు. ఆయా ఇళ్లలో సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, రూ. 4 లక్షల నగదు చోరీ చేసినట్లు సమాచారం. చోరీ చేసిన బంగారు ఆభరణాలను కంపమల్లకు చెందిన ఓ వ్యక్తి సహకారంతో కోవెలకుంట్లలోని ఓ నగల దుకాణంలో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల కంపమల్లలో చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి దొంగను అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు అధికారికంగా పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

వలంటీర్లను అడ్డుకోవడం దారుణం



రణత్‌యాదవ్‌ను అరెస్టు చేసిన పోలీసులు

డోన్ రూరల్: హామీలను అమలు చేయాలని కోరుతున్న వలంటీర్లను చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రణత్‌యాదవ్ అన్నారు. శనివారం విజయవాడలో ధర్నా చేసేందుకు వెళ్తున్న రణత్‌యాదవ్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను, ధర్నాలను కూటమి ప్రభుత్వం ఆపలేదన్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని.. గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు చెప్పలేదా అని ప్రశ్నించారు.

బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం ముఖ్యం



బ్లడ్ గ్రూప్ తెలుసుకుంటున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్ ఏదో తప్పనిసరిగా తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపు తెలుసుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. సాధారణంగా ఏ,బీ,ఓ,ఏబీ.. వీటిలో పాజిటివ్, నెగిటివ్ అనే ఎనిమిది రకాల గ్రూపులు ఉంటాయని వివరించారు. చాలా అరుదుగా బాంబే బ్రేడ్ గ్రూపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కౌసల్య, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సైపుల్లా, అమీర్ బాషా, జహీర్‌బాషా, రెహ్మాన్, జలీల్ పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

బేతంచెర్ల: విద్యార్థుల అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ సోమశేఖర్‌తో కలిసి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలతో అపార్ నమోదు, దానికి అవసరమైన ఆధార్, జనన ధృవీకరణ పత్రాల్లో మార్పులు, చేర్పుల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. బేతంచెర్ల మండలంలో ఇప్పటి వరకు 70 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగతా 30 శాతం పూర్తిచేయడానికి అందరూ సహకరించాలన్నారు.

ఉర్దూ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ఉర్దూ అధ్యాపకురాలు

బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఉర్దూ దినోత్సవం(అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ జయంతి)ని నిర్వహించారు. ఉర్దూ అధ్యాపకురాలు కౌసల్యదేవి మాట్లాడుతూ.. అల్లామా ముహమ్మద్ ఇక్బాల్, మిర్జా అసదుల్లాహ్ ఖాన్ గాలిబ్ వంటి కవులు ఉర్దూ సాహిత్యానికి వన్నె తెచ్చారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబునాథ్, అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ టాయ్‌లెట్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ప్లాంట్ హెడ్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ పరిసర గ్రామాల్లో స్మార్ట్ టాయ్‌లెట్ల నిర్మాణానికి శుక్రవారం కల్వటాలలో ప్లాంట్ హెడ్ రెడ్డినాగరాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలయ సంస్థతో కలిసి రామ్‌కో సిమెంట్ సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో కంపెనీ పరిధిలోని కల్వటాల, నాయినపల్లె, చింతలాయిపల్లె, కోటపాడు గ్రామాల్లో వంద స్మార్ట్ టాయ్‌లెట్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో గ్రామంలో మొదటి విడత 25 చొప్పున ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలనే ఉద్దేశంతో ఒక్కో దానికి రూ.50 వేల మేర ఖర్చు చేసి స్మార్ట్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాలుగు గ్రామాల్లో సర్వే చేసి మిగిలిన వారికి ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కామిని సుమలత, రామ్‌కో అడ్మిన్ హెడ్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్, మేనేజర్ శోభన్ బాబు, గ్రామాలయ సంస్థ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రుడు

బనగానపల్లె రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన శుక్రవారం బనగానపల్లె మండలం క్రిష్టగిరి మెట్ట సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పసుపల గ్రామానికి చెందిన కవిరాజు వ్యక్తిగత పనినిమిత్తం బనగానపల్లెకు బైక్‌పై వస్తున్నాడు. మరోవైపు పాతపాడు గ్రామానికి చెందిన అశోకచక్రవరి డోన్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. డ్యూటీ నిమిత్తం మోటర్ సైకిల్‌పై పాతపాడు నుంచి వెళుతున్నాడు. క్రిష్టగిరి మెట్ట సమీపంలోని వంతెన మలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరి కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.